## 23న మున్సిపల్ వర్కర్స్ యూనియన్ మహాసభ

- విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ పిలుపు

2లో



www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
సత్తుపల్లి భద్రాద్రి
శనివారం | 20 | జూన్ | 2026
పేజీలు : 8

# ప్రైవేటుపై నియంత్రణ ఏదీ...?




-పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేటు విద్యా సంస్థలు
-రకరకాల పేర్లతో దోపిడీ
-నిబంధనలకు పాతర..
ఉలుకు పలుకులేని విద్యాశాఖ

**ప్రజాపక్షం/ఖమ్మం :** విద్య వ్యాపార వస్తువుగా మారింది. దీనికి తోడు తల్లిదండ్రులకు ప్రైవేటుపై ఉన్న మోజు వెరసి విద్య లాభసాటి వ్యాపారంగా మారింది. ఇదే సమయంలో ప్రైవేటు విద్యపై ప్రభుత్వం నియంత్రణ కోల్పోవటంతో విద్యా వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్థిల్లుతుంది. ప్రభుత్వ బలహీనత చేయి కలుపుతున్న విద్యాశాఖాధికారులను ఆసరాగా చేసుకుని రకరకాల పేర్లతో పుట్టగొడుగుల్లా విద్యా సంస్థలు పుట్టుకొస్తున్నాయి. అన్ని ప్రైవేటు విద్యా సంస్థలను ఒక గాటిన కట్టేయ్యలేం కానీ నిబంధనలకు తిలోదకాలు ఇచ్చి ధనార్జనే ధ్యేయంగా వ్యవహరించే విద్యా సంస్థల పట్ల చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### నిబంధనలకు తూట్లు...

ప్రభుత్వ నిబంధనలకు లోబడి విద్యా సంస్థలను నిర్వహించాల్సి ఉంటుంది. మూడొంతుల ప్రైవేటు విద్యా సంస్థలు నిబంధనలకు తూట్లు పొడిచి అక్రమ పద్ధతిలో అనుమతులు పొందుతున్నాయి. ప్రైమరీ విద్యార్థులకు బహుళ అంతస్తుల్లో తరగతులు నిర్వహించకూడదన్న నిబంధనలను పట్టించుకోవడం లేదు. మౌలిక వసతులు, ఆట స్థలాలు అన్నింటికి మించి అర్హత కలిగిన ఉపాధ్యాయుల నియామకం జరగడం లేదు. గుర్రం గుడ్డిదైనా దానా తక్కువ లేదన్నట్లు అర్హత కలిగిన బోధనా సిబ్బంది లేకపోయినా ఫీజులు మాత్రం తగ్గడం లేదు.

మిగతా 2లో..

# రక్త పరీక్ష కేంద్రాల తనిఖీ





రక్త పరీక్షల పేరుతో భారీ దందా..!

-ప్రజాపక్షం కథనానికి స్పందన
-పలు రక్తం పరీక్ష కేంద్రాలకు మూసివేయాలని ఆదేశాలు
-సరైన ధృవపత్రాలు ఉంటేనే నిర్వహణ
-జిల్లా వైద్యాధికారి రామారావు

**ప్రజాపక్షం/వైరా :** జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డి.రామారావు ప్రజాపక్షం కథనాన్ని స్పందించి జిల్లాలో పలు మండలాల్లో రక్త పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. శుక్రవారం ప్రజాపక్షం దినపత్రికలో రక్త పరీక్షల పేరుతో వారి దందా నిబంధనలకు విరుద్ధంగా నిర్వహణ తప్పుడు రిపోర్ట్‌లతో రోగి ప్రాణాలతో చెలగాటం అనే విషయాలతో సంబంధించిన

మిగతా 2లో..

## నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయండి

-భూసేకరణ, పరిహారం చెల్లింపుల పురోగతిపై అధికారులతో సమీక్ష
-కమిషనర్ శివకుమార్ నాయుడు

సెంటర్‌స్ప్రెడ్



## ఎస్ఐఆర్‌ను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలి




-ప్రతి ఓటరు వివరాలు సమగ్రంగా పరిశీలించాలి
-రఘునాథపాలెంలో ఎస్ఐఆర్ ప్రక్రియను తనిఖీ చేసిన కలెక్టర్

**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూసే ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియకు ప్రజలంతా తమ పూర్తి వివరాలతో స్వచ్ఛందంగా సహకరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. శుక్రవారం ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలన్నారు. శుక్రవారం ఖమ్మం నియోజక వర్గం రఘునాథపాలెం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్ (ఎస్ఐఆర్) మ్యాపింగ్ ప్రక్రియను కలెక్టర్ దివాకర టిఎస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ ఓటర్లను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక సమగ్ర సవరణ

మిగతా 2లో..

# ప్రైవేటుపై నియంత్రణ ఏదీ...?

(మొదటిపేజీ తరువాయి)




**ఫీజులపై నియంత్ర ఏదీ ..?**

ప్రైవేటు విద్యా సంస్థల ఫీజుల వసూళ్లపై నియంత్రణ లేదు. రకరకాల పేర్లతో విద్యార్థుల తల్లిదండ్రులను పీల్చిపిప్పి చేస్తున్నారు. అదేమంటే సవా లక్ష కారణాలు చూపుతూ మా సంస్థలో ఇలానే ఫీజులు ఉంటాయి మీ ఇష్టం అంటున్నారు. కొన్ని విద్యా సంస్థలు విద్యా సంస్థల్లో చేరేటప్పుడు చెప్పే ఫీజుకు ఆ తర్వాత వసూలు చేసే దానికి సంబంధం ఉండటం లేదు. అడ్మిషన్ ఫారంపై పెన్సిల్‌తో రాసి ఆ తర్వాత దానిని దిద్ది ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. లాభాల కోసమే పనిచేస్తున్న సంస్థలు షూ, యూనిఫాం, పుస్తకాలు మా వద్దనే కొనుగోలు చేయాలని నిబంధన విధిస్తూ వీలైనంత మేర దోచుకునే పనిలో ఉన్నారు.

**కొరవడిన పర్యవేక్షణ...**

ప్రైవేటు విద్యా సంస్థలపై విద్యాశాఖాధికారుల పర్యవేక్షణ కొరవడింది. ఎటువంటి పరిశీలన లేకుండానే అనుమతులు ఇచ్చేస్తున్నారు. బోధన సిబ్బందికి సంబంధించి అర్హత కలిగిన ఉపాధ్యాయుల పేర్లనే పలు విద్యా సంస్థలు తమ బోధన సిబ్బందిగా చూపుతున్నాయి. అయినా పట్టింపు లేదు. క్షేత్ర స్థాయిలో పరిశీలన జరగడం లేదు. విద్యాశాఖాధికారులను ప్రైవేటు విద్యా సంస్థలు శాసిస్తున్నాయి. కార్పొరేట్ విద్యా సంస్థలు ప్రభుత్వాలనే శాసిస్తున్న తరుణంలో విద్యాశాఖాధికారులను శాసించడం పెద్ద విషయం కాక పోవచ్చు. తల్లిదండ్రుల్లో ప్రైవేటుపై ఉన్న మోజును బలహీనతగా మార్చుకుని సొమ్ము చేసుకుంటున్నారు. అతి పెద్ద దోపిడీకి తెరలేపిన కొన్ని విద్యా సంస్థల పట్ల తక్షణ చర్యలు తీసుకోవాల్సి ఉంది. నిబంధనల విషయంలో క్షేత్ర స్థాయి పరిశీలన జరగాలన్న మంత్రుల మాటలు బేఖాతారైంది. ఇప్పటికైనా విద్యాశాఖాధికారులు మత్తు వీడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# 23న మున్సిపల్ వర్కర్స్ యూనియన్ మహాసభ

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఈనెల 23న రంగారెడ్డి జిల్లా రాజేందర్‌నగర్‌లోని కాటేదాన్‌లో తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ అవుట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) 4వ రాష్ట్ర మహాసభలు జరగనున్నాయని విజయవంతం చేయాల్సిందిగా సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ శ్రమజీవులకు పిలుపునిచ్చారు. శుక్రవారం ఏదులాపురం మున్సిపల్ కార్మికులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆ మహాసభలో చర్చించనున్నట్లు ఆయన తెలియజేశారు. ఇటీవల ముఖ్యమంతిర రేవంత్‌రెడ్డి విడుదల చేసిన కనీస వేతనాల చట్టంలో కనీస వేతనాలే లేవన్నారు. గ్రామ పంచాయతీలు, పురపాలికలు, మున్సిపల్ కార్పోరేషన్ల వారీగా మూడు జోన్లుగా విభజించి, ఆయా జోన్లలో నైపుణ్య కేటగిరీల వారీగా కనీస వేతనాలను కార్మికశాఖ ఖరారు చేయడం ఏమిటన్నారు. మున్సిపాలిటీలను జోన్2గా, గ్రామాలు, ఇతర ప్రాంతాలు జోన్3గా ప్రకటించిన కారణంగా చాలామందికి ప్రస్తుతం వస్తున్న వేతనంలో కోతల విధించే అవకాశం ఉందన్నారు. కొత్తగా హైస్కిల్డ్ కేటగిరీని చేర్చి జోన్1లో కనీస వేతనాన్ని రూ.20వేలుగా పెంచిందనీ వాస్తవానికి ఈ కేటగిరీలో పని చేస్తున్న వారికి అంతకంటే ఎక్కువ జీతాన్ని ప్రస్తుతానికే అందుకుంటున్నారన్నారు. ఇలా పలు సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీశారు. అనంతరం కార్మికులతో కలిసి ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోటా రామాంజనేయులు కరపత్రాన్ని ఆవిష్కరణ చేపించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు నీలం నాగరాజు, జిల్లా నాయకురాలు బల్లి ఉప్పలమ్మ, బద్దల పిచ్చయ్య, ఘనపరపు అమర్తమ్మ, దిండిగల విజయ, ధర్మాల మరియమ్మ, వేల్పుల చిన్న భద్రమ్మ, సమ్మయ్య, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# రక్త పరీక్ష కేంద్రాల తనిఖీ

(మొదటిపేజీ తరువాయి)



శీర్షికను ప్రచురించడం జరిగింది. ఈ కథనం జిల్లావ్యాప్తంగా ప్రజల్లో చర్చనీయంగా మారడంతో పాటు పలువురు అధికారులు కూడా రక్త పరీక్షల కేంద్రాల్లో జరిగే లోపాలను సరిదిద్దే అందుకు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ముందుకు వచ్చింది. శుక్రవారం వైరా మండలంలో నాలుగు ప్రైవేటు రక్త పరీక్ష కేంద్రాలను డిఎంహెచ్‌వో రామారావు తనిఖీ చేశారు. ప్రసాద్ ల్యాబ్, అరవింద ల్యాబ్, సాగర్ ల్యాబ్‌లను పరిశీలించారు. సాగర్ ల్యాబ్ నిర్వాహకులు సరైన ధృవపత్రాలు చూపించగా రిజిస్ట్రేషన్ అనుమతులు కూడా ఉండాలని తెలిపారు. మిగతా రక్త పరీక్ష కేంద్రాల్లో అనుమతులు సక్రమంగా లేవని చర్యలు తప్పవు అని ఆదేశించడంతో పాటు సరైన పత్రాలు చూపించిన తర్వాతే ల్యాబ్‌లను ఓపెన్ చేయాని ఆదేశించారు. కొణిజర్ల మండలం కొణిజర్లలో వెంకటేశ్వర ల్యాబ్‌లో తనిఖీలు నిర్వహించారు. అదేవిధంగా ఖమ్మం బ్యాంకు కాలనీలోనే స్ప్రింట్ రక్త పరీక్ష కేంద్రం డిఎంహెచ్‌వో తనిఖీ చేశారు. ఈ





సందర్భంగా ల్యాబ్‌లో సర్వీసెస్ రికార్డులను రిజిస్టర్‌ను లైసెన్సులను, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ నాణ్యతను ఆయన పరిశీలించారు. అదేవిధంగా జిల్లాలో రెండు రోజులపాటు ప్రత్యేక తనిఖీలు ఉంటాయని వైద్యశాఖ వర్గాలు చెబుతున్నాయి. ఈ సందర్భంగా డిఎంహెచ్‌వో రామారావు మాట్లాడుతూ రక్త పరీక్ష కేంద్రాలు రోగులకు కచ్చితమైన నాణ్యమైన పరీక్షలు నిర్వహించాలని, ప్రతి ల్యాబ్‌లో రికార్డులు సక్రమంగా ఉండాలని మార్గదర్శకాలు పాటించాలని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేకుండా పరీక్షలు చేయడం రోగులకు తప్పుడు రిపోర్ట్ ఇవ్వడం జరిగితే చట్టపరంగా వారిపై కేసులు నమోదు చేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వైరా మండల మెడికల్ అధికారి డాక్టర్ హర్ష, డిఆర్‌ఏ సెక్షన్ అసిస్టెంట్ రామకృష్ణ, పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్‌ను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలి

**(మొదటిపేజీ తరువాయి)** కార్యక్రమం ద్వారా ప్రతి ఓటరు వివరాలను క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలిస్తూ మ్యాపింగ్ ప్రక్రియ మరింత వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ఎలాంటి పొరపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియలో బిఎల్‌ఓల పనితీరును నిరంతరం పరిశీలించాలన్నారు. క్షేత్రస్థాయిలో ఖచ్చితమైన ధృవీకరణ, సరైన డేటా నమోదు, పారదర్శకతతో పని చేయాలన్నారు. ఎస్ఐఆర్‌లో భాగమైన మండలాలు, కార్పోరేషన్, మున్సిపాలిటీకి సంబంధించి ప్రతి ఓటర్లను మ్యాపింగ్ చేసేవిధంగా టార్గెట్ పెట్టుకుని వంద శాతానికి చేరుకోవాలన్నారు. ప్రత్యేక సమగ్ర సవరణ ఓటరు ప్రక్రియ జూన్ 24 నుంచి జూలై 25 వరకు చేపట్టాలన్నారు. డబుల్ ఓట్లు, మరణించిన ఓట్ల వివరాలు ధృ వీకరించి తొలగింపు ప్రక్రియ చేపట్టాలని సూచించారు. బిఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ సేకరణ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. అర్హులైన ప్రతి ఓటరును జాబితాలో చేర్చి అనర్హులైన ఓటర్ల వివరాలను తొలగించే ప్రక్రియను సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. ప్రజలంతా ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమంలో పాల్గొనాలని కలెక్టర్ తెలి పారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్వేత, సర్పంచ్ గాజుల కృష్ణారావు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# వైద్యుల అప్రమత్తతతో చిన్నారికి పునర్జన్మ

**-ఆశాకిరణంగా మారిన వైద్యులు కూరపాటి ప్రదీప్‌కుమార్**





**ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగం:** వైద్యుల సమయస్ఫూర్తి, నైపుణ్యం, సేవాభావం కలిసివచ్చి ఓ చిన్నారి ప్రాణాలను సురక్షితంగా కాపాడిన ఘటన స్థానికంగా ప్రసంశలు అందుకుంటోంది. అత్యవసర పరిస్థితులల్లో వైద్యులు అప్రమత్తంగా వ్యవహరించి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఆపరేషన్ అనంతరం బాలుడి ఆరోగ్య పరిస్థితి వేగంగా మెరుగుపడింది. కేవలం 72 గంటల్లోనే అతను నడవడం ప్రారంభించడం వైద్యులను, కుటుంబ సభ్యులను ఆనందానికి గురిచేసింది. చిన్నారి కోలుకోవడంతో తల్లిదండ్రులు వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. ఒక వైపు వైద్యనైపుణ్యం, మరోవైపు మానవత్వం కలిసివస్తే అద్భుతాలు సాధ్యమవుతాయని ఈ ఘటన మరోసారి నిరూపించింది. ఆర్థిక ఇబ్బందులు చికిత్సకు అడ్డంకి కాకూడదనే సందేశాన్ని కూరపాటి హాస్పటల్ ఆచరణలో చూపించింది. ఏడు లక్షల రూపాయల వైద్య ఖర్చు అనే మాట విన్న వెంటనే ఓ నిరుపేద చిన్నారి కుటుంబం ఆశలు వదులుకున్నారు. చిన్నారి ప్రాణాలను కాపాడాలని ఉన్నా, చేతిలో డబ్బు లేక నిస్సహాయంగా నిలిచిపోయారు. అటువంటి సమయంలో ఖమ్మంలోని కూరపాటి చిల్డ్రన్ అండ్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ వారికి అండగా నిలిచింది. తల్లంపాడుకు చెందిన జి ఆషీర్‌కు వచ్చిన ఫిట్స్ వెనుక బ్రెయిన్ ట్యూమర్ ఉన్నట్లు వైద్య పరీక్షల్లో తేలిం ది. వెంటనే శస్త్రచికిత్స అవసరమని వైద్యులు సూచించారు. చిన్నారి తల్లితండ్రులు వేదన గురై కన్నీటి పర్యంతమయ్యారు. దిక్కుతోచని పరిస్థితుల్లో కూరపాటి చిల్డ్రన్ హాస్పటల్ చిన్నారికి అండగా నిలిచి తన జీవితంలో కొత్త వెలుగును నింపింది. డాక్టర్ కూరపాటి ప్రదీప్ కుమార్ సేవాభావాన్ని స్థానికులు ప్రశంసిస్తున్నారు. శస్త్రచికిత్సలో పాల్గొన్న నిపుణులు బృందం సమిష్టి కృషి చిన్నారికి కొత్త జీవితాన్ని అందించింది. నిరాశ అంచుల్లో ఉన్న కుటుంబానికి ఈ వైద్యం ఆశాకిరణంగా మారి, తల్లిదండ్రుల ముఖాల్లో మళ్లీ చిరునవ్వుల పూయించింది. మానవత్వంతో కూడిన వైద్యసేవలకు ఈ ఘటన చిరస్మరణీయ ఉదాహరణగా నిలిచింది.

# మద్యం మత్తులో వీరంగం

**- రాజీవ్‌గాంధీ కటౌట్ తొలగింపు - కాంగ్రెస్ నాయకుల వాగ్వివాదం**

**- పోలీసులకు అప్పగించిన వైనం**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** మద్యం మత్తులో ఓ వ్యక్తి వీరంగం సృష్టించాడు. రాజీవ్‌గాంధీ కటౌట్‌ను తొలిగించడంతో కాంగ్రెస్ నాయకులు వాగ్వివాదంతో పోలీసులకు అప్పగించారు. మండల కేంద్రంలోని ప్రధాన కేంద్రంలో శుక్రవారం అరుపులు, కేకలు పెడుతూ అటూ ఇటూ పరుగులు పెట్టి వీరంగం సృష్టించాడు. చాకలి ఐలమ్మ విగ్రహానికి అడ్డుగా ఉందని, పొంతనలేని మాటలతో కాంగ్రెస్ నాయకులతో వాగ్వివాదానికి దిగాడు. ఈ క్రమంలో ప్రజలు పెద్ద ఎత్తున చేరుకొని పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో పైనంపల్లి సర్పంచి కుక్కల నరేశ్, నాయకులు జెర్రిపోతుల సత్యనారాయణ, రెడ్డిమళ్ల బాబురెడ్డి, కుక్కల హనుమంతరావు, కడియాల నరేశ్ తదితరులు ఉన్నారు.

# ఆళ్లపల్లిలో రైతుల భారీ ర్యాలీ, ధర్నా



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** పంటల కొనుగోళ్లపై ముఖ్యమంత్రి ప్రకటనను వ్యతిరేకిస్తూ ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో ఆళ్లపల్లిలో రైతులు ర్యాలీ నిర్వహించి, తహసీల్ధార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్ధార్‌కు అందజేశారు. ఈసందర్భంగా ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి ఏనుగు చంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలు రైతులను సంక్షోభంలోకి నెడుతున్నాయని ఆరోపించారు. ప్రభుత్వాలే పంటలు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏఐకేఎంఎస్ మండల అధ్యక్షుడు కొమరం సత్యనారాయణ, మండల కార్యదర్శి పూనెం రంగయ్య మాట్లాడుతూ రైతులకు విత్తనాలు, ఎరువులు సరఫరా చేయాలని, నకిలీ విత్తనాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో మండల నాయకులు మేస్ గోపాల్, వాగబోయిన రాంబాబు, గొగ్గల బోజ్జయ్య, ఇస్లావత్ రాందాస్, పూసం రాంబాబు, గొగ్గల గాదాలు, ఈసం ఎల్లయ్య, తోట వీరభద్రం, పూనెం బతుకయ్య, పూనెం రమేష్, బొమ్మెర్ల సమ్మయ్య పాల్గొన్నారు.

# అంగన్వాడీ సిబ్బందికి రూ.18వేల వేతనం అమలు చేయాలి



**ప్రజాపక్షం/ములకలపల్లి:** అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో పాటు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లకు రూ 18వేల వేతనం వెంటనే అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్ డిమాండ్ చేశారు. దమ్మపేట ప్రాజెక్ట్ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్(ఏఐటీయూసీ)మహాసభ ములకలపల్లిలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ సిబ్బందిపై అదరపు పనుల భారం మోపడం మానుకోవాలని, బీఎల్‌వో విధులను రద్దు చేయాలని కోరారు. అనంతరం ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షురాలు గోనే మణి, జిల్లా కార్యదర్శి వేల్పుల మల్లికార్జున్ మాట్లాడుతూ అంగన్వాడీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని అన్నారు. ఈకార్యక్రమంలో ఎండి యూసుఫ్, రమేష్, జబ్బార్, సునీత, సావిత్రి, శోభ, శివలక్ష్మి , మాధవి, ఉపేంద్ర, సుభాషిణి, మణి, తదితరులు పాల్గొన్నారు.

# కమీషనర్‌ను కలిసిన పిఆర్‌టియు నాయకులు

**ప్రజాపక్షం/వైరా:** సెన్సస్ విధులు నిర్వహించిన ఉద్యోగ ఉపాధ్యాయులకు అటెండెన్స్ సర్టిఫికెట్ అందించాలని రెమ్యూనరేషన్ త్వరగా అందించేలా ఏర్పాటు చేయాలని, 2024 నవంబర్‌లో కులగణన సర్వే నిర్వహించిన వారికి ఇప్పటివరకు రెమ్యూనరేషన్ అందించలేదు. కాబట్టి త్వరగా అందించే విధంగా ఏర్పాట్లు చేయాలని పిఆర్‌టియు వైరా మండల శాఖ అధ్యక్షులు వెలిశెట్టి నర్సింహారావు, ప్రధాన కార్యదర్శి వేమిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి ప్రాతినిధ్యం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ మేనేజర్ సుధీర్ పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

**వంద పడకల ఆసుపత్రి పనులను పరిశీలించిన కలెక్టర్ దివాకర టీఎస్**





**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం:** ప్రభుత్వం గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఎలాంటి రాజీ పడట్లేదని పేద ప్రజలకు వైద్య సేవలు అందించడంలో వైద్యుల పాత్ర ముఖ్యమని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ పేర్కొన్నారు. మండలంలోని వైద్య విధాన పరిషత్‌ను శుక్రవారం సందర్శించి ఓపీ రిజిష్టర్, ఆపరేషన్ థియేటర్, ఫార్మసీ, రక్త పరీక్ష కేంద్రాలను పరిశీలించి మాట్లాడారు. గర్భిణీ స్త్రీలను సాధారణ కాన్పులు అయ్యేలా ప్రోత్సహించాలని, ప్రభుత్వ ఆసుపత్రిలోనే కాన్పులు జరిగేలా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు నేరుగా పిర్యాధులు చేయలేరని, ప్రతీ వార్డుల్లో ఫిర్యాధుల బాక్సులను ఏర్పాటు చేయాలని తెలిపారు. 30పడకల ఆసుపత్రి నుంచి వంద పడకల ఆసుపత్రిగా రూ.20కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న పనులను పరిశీలించి, పనులు నాణ్యతాప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ వైద్యుడు రాజశేఖర్, సూపరిన్‌డెంట్ కృప ఉషశ్రీ, వైద్య శాఖ ఈఈ ఉమామహేశ్వరరావు, ఎంపీడీఓ సిలార్ సాహెబ్, తహసీల్ధార్ విల్సన్, ఎంపీఓ ప్రభాకర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రమేశ్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రూ.8.69కోట్ల పనులకు కౌన్సిల్ గ్రీన్‌సిగ్నల్



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురంమున్సిపాలిటీ కౌన్సిల్ సాధారణ సమావేశం శుక్రవారం చైర్‌పర్స్‌న పోకబత్తిని అనిత అధ్యక్షతన పెద్దతండలోని కార్యాలయంలో నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణ అభివృద్ధి, మౌలిక సదుపాయాల మెరుగుదల, విద్యుత్ నిర్వహణ, బడ్జెట్ కేటాయింపులు, పరిపాలనా అంశాలపై విస్తృతంగా చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశ అజెండాలో భాగంగా మున్సిపాలిటీపరిధిలో వీధి లైట్ల నిర్వహణ, ఎల్‌ఈడి బల్బులు, సంబంధిత పరికరాల కొనుగోలు ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. అలాగే ఇంజినీరింగ్ విభాగానికి అవసరమైన పరికరాల కొనుగోలు అంశాలను పరిశీలించి నిర్ణయం తీసుకున్నారు. అదేవిధంగా పలు వార్డుల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, మరమ్మతులు, మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన వ్యయ ప్రతిపాదనలను ఆమోదించారు. మున్సిపల్‌పరిధిలో చేపట్టనున్న సివిల్ పనులు, విద్యుత్ విభాగానికి సంబంధించిన బిల్లులు, కొత్త ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన అంచనాలు, బడ్జెట్ అంశాలపై కూడా చర్చించారు. అలాగే వివిధ పనులకు పరిపాలనా అనుమతులు, టెండర్ల అంశాలపై కౌన్సిల్ తుది నిర్ణయాలు తీసుకుంది. సమావేశంలో ఆమోదించిన ప్రతిపాదనలు, అభివృద్ధి, నిర్వహణ కార్యక్రమాల మొత్తం విలువ సుమారు రూ.8.69కోట్లుగా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, కమీషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, మేనేజర్ శ్రీనివాస్, ఆర్‌ఐలు శ్రీధర్‌రెడ్డి, రఘు, సంబంధిత అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల ఉద్యమం ఉధృతం

**రెండవ రోజు తహశీల్దార్‌కు వినతి**



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ఆర్ సి ఇంచార్జ్ గా పనిచేస్తున్న జర్నలిస్టులకు జిల్లా ఎడిషన్ కార్డులు ఇచ్చి రాష్ట్రస్థాయిలో బస్ పాస్ సౌకర్యం కల్పించాలని సత్తుపల్లి జర్నలిస్ట్ జాయింట్ యాక్షన్ కమిటీ తరపున జర్నలిస్టుల సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని స్థానిక ఎమ్మార్వో పున్నం సత్యనారాయణకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు సీనియర్ జర్నలిస్టులు మాట్లాడుతూ గత 20 ఏళ్లుగా లేని నిబంధనను ప్రస్థుత కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డగోలుగా జీవో 252 తీసుకొచ్చి ఆర్ సి ఇంచార్జ్ లుగా ఎన్నో ఏళ్లుగా పనిచేస్తున్న జర్నలిస్టులకు మండల అక్రిడేషన్ కార్డులు ఇచ్చి, జిల్లా బస్సు పాసులు ఇవ్వడం జర్నలిస్టులను చిన్న చూపు చూస్తున్నారని విమర్శించారు. తక్షణమే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకొని నియోజకవర్గ స్థాయిలో పనిచేస్తున్న జర్నలిస్టులకు జిల్లా అక్రిడేషన్ కార్డులు మంజూరు చేసి బస్సు పాస్, హెల్త్ కార్డ్, జర్నలిస్టులకు ఇల్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సీనియర్ రిపోర్టర్లు మాదిరాజు సుధాకర్, ఎండి షైబుద్దీన్, చిన్నిని బాలకృష్ణ, షేక్ ఖాదర్ బాబా, నిమ్మగడ్డ శ్రీకాంత్, రామిశెట్టి లక్ష్మణరావు, భీమిశెట్టి రాము, బి.వి.రామారావు, తడకమళ్ళ దేవ, బేతి ఆనంద్, కె. సతీష్, రాజేష్ రెడ్డి, కె. బాలాజీ, చీపు గంగాధర్, బొల్లిపోగు సురేష్, గురవయ్య, కొత్తపల్లి సుధాకర్, మునీర్, కాకర్ల జగన్, బల్లెం చిరంజీవి, కోట అశోక్ రాజ తదితరులు పాల్గొన్నారు.

# పుస్తకాల పేరుతో వసూలు చేస్తున్న అధిక ఫీజులను అరికట్టండి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** పాఠ్యపుస్తకాల పేరుతో దోపిడీ చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి నక్కా రాజేశ్వరరావుకు శుక్రవారం భాజపా నాయకులు వినతిపత్రం అందజేశారు. బీజేపీ సత్తుపల్లి నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షులు బాణావత్ విజయ్ అధ్యక్షతన జరిగిన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా ప్రధాన కార్యదర్శి నాయుడు రాఘవరావు హజరై మాట్లాడారు. పాఠశాల యాజమాన్యాలు పాఠ్య పుస్తకాల పేరుతో భారీగా దోపిడి చేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రుల తమ దృష్టికి తీసుకువచ్చారని, గత వారం రోజులు నుంచి అనేకమంది తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులు తమ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు అందాయన్నారు. పుస్తకాల పేరుతో పాఠశాల యాజమాన్యాలు వసూలు చేస్తున్న ఫీజులను చూసి తల్లిదండ్రులు గుండెలు బాదుకుంటున్నారని, తక్షణమే ఈ దోపిడిని నియంత్రించాలని, పుస్తకాలు పాఠశాలలోనే కాకుండా బయట తీసుకునేందుకు అవకాశం కల్పించాలన్నారు. పాఠశాలల యాజమాన్యాలు ఫీజులు తగ్గించకపోతే జిల్లా విద్యాశాఖ అధికారి, కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మండలాధ్యక్షులు పాలకొల్లు శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి మందా శివకృష్ణ యాదవ్, పట్టణ కార్యదర్శి కార్తీక్ యాదవ్, అశోక్, డాక్టర్ పెద్దిరాజు, వీరబాబు, సీనియర్ నాయకులు మన్నేని నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీనారాయణకు పరామర్శ



**ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగం :** ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు, సిపిఐ సీనియర్ నాయకులు గాదె లక్ష్మీనారాయణ గత కొంత కాలంగా అనారోగ్యంతో స్థానిక గుడిపూడి ఈ ఎన్‌టి ఆస్పత్రి గొంతుకు శస్త్ర చికిత్స చేయించుకుని చికిత్స పొందుతున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం దుర్గవిరించి హాస్పటల్ అధినేత, ప్రముఖ క్లినికల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ కిరణ్‌కుమార్ గుదిగొండ ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా గాదె లక్ష్మీనారాయణ ఆరోగ్య పరిస్థితిని కుటుంబసభ్యులను అడిగి తెలుసుకున్న డాక్టర్ కిరణ్‌కుమార్, చికిత్స వివరాలపై వైద్యులతో చర్చించారు. అనంతరం ఈఎన్‌టి వైద్య నిపుణులు డాక్టర్ గుడిపూడి రాజేష్‌ను కలిసి శస్త్రచికిత్స అనంతర పరిస్థితి, అందిస్తున్న వైద్య సేవల గురించి ఆరా తీశారు. లక్ష్మీనారాయణ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన డాక్టర్ కిరణ్ కుమార్, అవసరమైన వైద్య సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ పరామర్శ కార్యక్రమంలో ప్రజాపక్షం వైద్య విభాగం రిపోర్టర్ ఆకెన పవన్ పాల్గొన్నారు.

## ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను సత్తుపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా సత్తుపల్లి ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి దయానంద్ హజరై కేక్ కట్ చేసి రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ ప్రజల హక్కుల కోసం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ నిరంతరం పోరాడుతున్న నాయకుడని కొనియాడారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఆయన చేస్తున్న కృషి అందరికీ ఆదర్శమని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో భారత ప్రదానిగా రాహుల్ గాంధీ దేశ ప్రజలకు సుపరిపాలన అందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రిహానా కమల్ పాషా, వైస్ చైర్మన్ బొంతు సుమలత, కౌన్సిలర్లు తోట సుజల రాణి, దేవి స్వీట్స్ శ్రీను, మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, మండల పార్టీ అధ్యక్షుడు భీమిరెడ్డి సుబ్బారెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు గాదే చెన్నకేశవరావు, కమల్ పాషా, చలగుళ్ళ నరసింహారావు, టోపీ శ్రీను, విరివాడ నాగభూషణం పాల్గొన్నారు.

## వంద పడకల ఆసుపత్రి ఆకస్మిక తనిఖీ

**ప్రజాపక్షం/మధిర మున్సిపాలిటీ:** పురపాలక పరిధిలోని రెండో వార్డు ఉద్యోగుల కాలనీలోని వంద పడకల ఆసుపత్రిని అసిస్టెంట్ కలెక్టర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రికి సంబంధించిన రికార్డులను పరిశీలించి, అనంతరం రోగులను వైద్యసదుపాయాలకు సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది సమయపాలన పాటించి, ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించాలని సూచించారు. తొందరలోనే ల్యాబ్‌కు సంబంధిత పరికరాలు, అవసరమైన ఇతర వైద్య పరికరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

## అభివృద్ధి పనుల పరిశీలన





**ప్రజాపక్షం/మధిర మున్సిపాలిటీ:** పురపాలక పరిధిలోని మహాప్రస్థానం, అంతర్గత మురుగు కాలువ నిర్మాణ పనులను అసిస్టెంట్ కలెక్టర్ శ్రీజ శుక్రవారం పరిశీలించారు. అభివృద్ధి పనులు నాణ్యతా ప్రమాణాలు పాటించి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమం లో మున్సిపల్ కమిషనర్ సామ్యూల్ ఇజ్రాయిల్ పాల్, ఛైర్ పర్సన్ సామినేని సుజాత, వైస్ ఛైర్మన్ కోనా దని, 17వ వార్డు కౌన్సిలర్ ములకలపల్లి వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడిలో పిల్లలను చేర్పించిన సర్పంచి, వార్డు సభ్యురాలు



**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** ప్రభుత్వ పాటశాలల్లో పిల్లలను చేర్పించాలనే ప్రజాప్రతినిధులు చూసినప్పటికి వారిలో కొంతమందే తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించే వారు అరుదనే చెప్పొచ్చు. వారిలో మండలంలోని నాచేపల్లి సర్పంచి, వార్డు సభ్యురాలు ఒకరు. ఈ మేరకు సర్పంచి భూక్య మౌనిక నాగేశ్వరరావు కుమారుడు గతంలో ఓ ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న క్రమంలో ప్రభుత్వ పాఠశాలల్లోనే తమ పిల్లలను చేర్పించాలని చెబుతూ వారి కుమారుడిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. ప్రభుత్వ పాఠశాలలను బతికించుకోవాలని, ప్రభుత్వం విద్యకు ఎంతో ప్రాముఖ్యతనిస్తూ ముందుకు సాగుతోందని, తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించి, ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను వినియోగించుకోవాలని కోరారు. సర్పంచి పిల్లలతో పాటు వార్డు సభ్యురాలు కూరపాటి మాధవి కుమారుడు, కుమార్తెను ప్రైవేట్ పాఠశాల నుంచి స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బి.చలపతిరావు, ప్రదానోపాద్యాయుడు కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి బాబూరావు, ఉపాధ్యాయులు ఎం.వీరబాబు, చిన్నా తదితరులు వారిని అభినందించి, వారిని స్పూర్తిగా తీసుకొని తమ పిల్లలను ప్రభుత్వ పాటశాలలోనే చేర్పించాలని కోరారు.

## 21న పామాయిల్ రైతుల ఆత్మీయ సమ్మేళనం



**ప్రజాపక్షం/దమ్మపేట:** దమ్మపేట మండల పరిధిలోని మల్కారం గ్రామంలో ఈనెల 21న పామాయిల్ రైతుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం ఉదయం 11గంటలకు జరగనున్న ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. పామాయిలు సాగు విస్తీర్ణం పెంపు, రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడం, తెలంగాణను దేశంలోనే పామాయిల్ సాగులో అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఈసందర్భంగా పామాయిల్ రైతులు ఘనంగా సన్మానించనున్నారు. అదే విధంగా మంత్రి తుమ్మల రాజకీయ రంగ ప్రవేశానికి 45 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా దమ్మపేట మండల ప్రజలు ప్రత్యేక అభినందన సభను నిర్వహించనున్నారు. మారుమూల గిరిజన ప్రాంతమైన దమ్మపేట నుంచి రాజకీయ ప్రస్థానం ప్రారంభించి సుదర్ఘీకాలంగా ప్రజాభిమాన్ని పొందడం గర్వకారణమని స్థానికులు పేర్కొన్నారు. మాల్కారం గ్రామ ప్రజలు, పామాయిల్ రైతులు, మండల ప్రజలు పార్టీలకు అతీతంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం విశేషం. పెద్ద ఎత్తున రైతులు, ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

## రూ. 10లక్షలతో శ్రీశక్తి భవనానికి శంకుస్థాపన



**ప్రజాపక్షం/ఏన్కూరు:** మండల పరిధిలోని రేపల్లెవాడ గ్రామంలో రూ 10లక్షల వ్యయంతో నిర్మించనున్న నూతన శ్రీశక్తి భవనానికి శుక్రవారం గ్రామ సర్పంచ్ అజ్మీర సురేష్ నాయక్ శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వైరా ఎంఎల్ఏ మాలోత్ రాందాస్ నాయక్ కృషితో ఎన్ఆర్ఈజీఎస్ నిధుల ద్వారా గ్రామానికి శ్రీశక్తి భవనం మంజూరు కావడం సంతోషకరమన్నారు. ఈ భవనం గ్రామ మహిళల సమావేశాలు, స్వయం సహాయక సంఘాల కార్యక్రమాలకు ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఆర్ఏఈ సూర్యనారాయణ, కాంగ్రెస్ జిల్లా డీసీసీ కార్యదర్శి తంబళ్ల సామేల్, కాంగ్రెస్ మండల యువజన అధ్యక్షుడు నిమ్మల నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ వీరభద్రం, నాయకులు కిషోర్, గణేష్, నరసింహారావు, పంచాయితీ కార్యదర్శి రాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## ఎరువులు, విత్తనాల దుకాణాలపై తనిఖీలు



**ప్రజాపక్షం/కారేపల్లి:** రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందేలా చూడటంతో పాటు నకిలీ విత్తనాలు, పురుగు మందుల విక్రయాలను అరికట్టేందుకు పోలీస్, వ్యవసాయ శాఖ అధికారులు శుక్రవారం కారేపల్లి మండలంలోని పలు ఎరువులు, విత్తనాల దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ తనిఖీల్లో కారేపల్లి ఎస్ఐ గోపి, వ్యవసాయ శాఖ అధికారి అశోక్ పాల్గొన్నారు. దుకాణాల్లో విక్రయాల రికార్డులు, స్టాక్ వివరాలు, లైసెన్సులు, బిల్లుల నిర్వహణ, నిల్వల పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించారు. రైతులకు విక్రయిస్తున్న, విత్తనాలు, ఎరువులు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా లేదా అనే అంశాలను తనిఖీ చేశారు. విత్తనాల ప్యాకెట్లపై ఉన్న తయారీ తేదీలు, గడువు తేదీలు, కంపెనీ వివరాలు తదితర అంశాలను కూడా పరిశీలించారు. రైతులను మోసం చేసే వారిపై ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్ష ఉందని అధికారులు హెచ్చరించారు. వ్యవసాయ సీజన్‌లో విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసే రైతులు తప్పని సరిగా బిల్లు తీసుకోవాలని సూచించారు. అనుమానాస్పద విత్తనాలు లేదా ఎరువులు కనిపిస్తే వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలని రైతులకు విజ్ఞప్తి చేశారు.

## ప్రపంచ సికిల్ సెల్ డే
## ఫ్రైడే డ్రైడే కార్యక్రమాల నిర్వహణ



**ప్రజాపక్షం/మణుగూరు:** ప్రపంచ సికిల్ సెల్ డే సందర్భంగా మణుగూరు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో అవగాహన సదస్సు నిర్వహించబడింది. ఈ సందర్భంగా సికిల్ సెల్ వ్యాధి ఒక వంశపారంపర్య రక్త సంబంధిత వ్యాధి అని, ముందస్తు పరీక్షలు మరియు సరైన వైద్య సలహాల ద్వారా వ్యాధి ప్రభావాన్ని తగ్గించవచ్చని ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే సికిల్ సెల్ వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలు మరియు ముందస్తు నిర్ధారణ ప్రాముఖ్యత గురించి వివరించారు.అదే విధంగా మణుగూరు మండలంలోని శివలింగాపురం గ్రామంలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా వర్షాకాలంలో దోమల ద్వారా వ్యాపించే డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధుల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, కొబ్బరి చిప్పలు, పాత టైర్లు, కూలర్లు, నీటి డబ్బాలు వంటి వాటిలో నీరు నిల్వ కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆయుర్వేద వైద్యురాలు డా. పావని, సబ్ యూనిట్ ఆఫీసర్ వీరస్వామి, హెల్త్ ఎడ్యుకేటర్ డి. పరంగిణి, హెల్త్ అసిస్టెంట్లు రాంప్రసాద్, కృష్ణ, ఏఎన్ఎం రాధ మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## చక్కటి వాతావరణంతోనే సంపూర్ణ ఆరోగ్యం

**- ఐటిడిఏ పిఓ రాహుల్**



**ప్రజాపక్షం/భద్రాచలం :** ప్రతీ మనిషీ అనారోగ్యాల పాలుకాకుండా ఉండాలంటే చక్కటి వాతావరణం అవసరమని, పర్యావరణాన్ని కాపాడుకుంటే అది మనల్ని కాపాడుతుందని ఇందు కోసం విరివిగా మొక్కలు నాటి సంరక్షణ చర్యలు తీసుకోవాలని ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి బి రాహుల్ అన్నారు. శుక్రవారం తన ఛాంబర్లో అటవీ, ఐటిసి, ఇజిఎస్, గ్రామ పంచాయితీ అధికారులతో కలిసి సారపాక గ్రామపంచాయితీ పరిధిలో లక్ష మొక్కలు నాటి వాటిని సంరక్షించే విధంగా ప్రణాళిక రచించేందుకు శుక్రవారం ఐటిడిఏ పిఓ చాంబర్లో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పిఓ మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంతమైన సారపాకలో పర్యావరణం కలుషితం కాకుండా సారపాక గ్రామపంచాయితీ సర్పంచ్ ఆధ్వర్యంలో వన మహోత్సవంలో భగంగా ఏడాదికి 25వేల మొక్కలు చొప్పున నాలుగేళ్లకు గానూ 1 లక్ష మొక్కలు నాటే విధంగా అధికారులు ప్రణాళికలు రచించాలన్నారు. ప్రధానంగా గానుగ, వేప, చింత, జామ, నేరేడు చెట్లతో పాటు వివిధ రకాల పండ్ల మొక్కలు నాటాలని చెప్పారు. అటవీ, ఐటిసి, ఇజిఎస్ వారు గ్రామపంచాయితీకి వివిధ రకాల మొక్కలను అందించి వాటిని క్రమపద్దతిలో నాటి కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు సహకరించాలని అన్నారు. ప్రజలను కూడా వనమహోత్సవ కార్యక్రమంలో భాగస్వాములను చేసి ప్రాణ వాయివు అందించే మొక్కలను నాటి వాతావరణం కలుషితం కాకుండా చూడాలన్నారు. చెట్ల పెంపకం వల్ల ఆరోగ్యమైన వాతావరణం ఉంటుందని, పర్యావరణం పరిరక్షించబడటంతో పాటు ప్రాణవాయివు అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ పరిపాలనాధికారి సున్నం రాంబాబు, సారపాక సర్పంచ్ కిషోర్ శివరామ నాయక్, డిఆర్ఓ కృష్ణ, ఐటిసి డెప్యూటీ జిఎం విశ్వనాధం, ఎన్ఆర్ఇజిఎస్ ఏపిఓ విజయలక్ష్మి పాల్గొన్నారు.

## సేవ్ మణుగూరు పోరాట కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

**-బ్రాంచ్ కార్యదర్శి వై రామ్ గోపాల్**
**-ఏరియాలోని అన్ని మైన్స్ డిపార్ట్మెంట్ల వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి కార్మికుల నిరసన**



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు ఏరియాలోని పీకే ఓసి డిప్ సైడ్ ఎక్స్టెన్షన్ బ్లాక్ సింగరేణికే కేటాయించాలని, మణుగూరు ఓసిపి మూసివేయక ముందే ఎక్స్టెన్షన్ అనుమతులు తేవాలని కోరుతూ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కే సి హెచ్ పి డి జి యం శ్రీ రుక్మాన్సింగ్ గౌడే కి మెమోరాండం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా బ్రాంచ్ కార్యదర్శి కామ్రేడ్ వై రామ్ గోపాల్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఎంఎండి ఆర్ చట్టం వల్ల దేశంలోని బొగ్గు బ్లాకు లన్ని ప్రైవేటు వారికి అప్పజెప్పేందుకు దేశ సంపదనంతటిని పెట్టుబడిదారులకు వేలం ద్వారా మార్గం సుగమం చేసిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎంఎండిఆర్ చట్టానికి ఆనాడు రాష్ట్రంలో ఉన్న టిఆర్ఎస్ ప్రభుత్వం మద్దతు తెలపడం వల్ల పార్లమెంటులో ఈ చట్టం పాస్ అయిందని అన్నారు. దాని ఫలితంగానే సింగరేణిలో కూడా బొగ్గు బ్లాక్ లను వేలం వేయడానికి గత టిఆర్ఎస్ ప్రభుత్వం మార్గం సుగమం చేసిందని అన్నారు. దాని ఫలితంగానే సత్తుపల్లి ఓసి, కోయగూడెం ఓసి 3 బొగ్గు బ్లాక్ లో ప్రైవేట్ వారికి దక్కాయని అన్నారు. దాని పర్యవసరంగానే ఈనాడు మణుగూరు లోని పీకే ఓ సి డిప్ సైడ్ బ్లాక్ వేలానికి వచ్చిందని అన్నారు. సింగరేణి ఏర్పడినప్పటి నుండి సంస్థ అభివృద్ధి, కార్మిక వర్గ సంక్షేమం కోరి ఎర్రజెండా యూనియన్ గా మణుగూరు పీకేఓసి డీప్ సైడ్ బ్లాక్ సింగరేణి కేటాయించాలని, అలాగే మణుగూరు ఓసిపి ఎక్స్టెన్షన్ అనుమతులు వెంటనే తేవాలని కోరుతూ బాధ్యతగల గుర్తింపు కార్మిక సంఘంగా సేవ్ మణుగూరు నినాదంతో నిరసన కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. ఏఐటియూసి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ యొక్క నిరసన, పోరాట కార్యక్రమాలకు సింగరేణి కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు మణుగూరు పట్టణ ప్రజానికం, మేధావులు, వ్యాపార వాణిజ్య వర్గాలు, అన్ని రాజకియ పార్టీల నాయకులు, ట్రేడ్ యూనియన్ నాయకులు, విద్యార్థి సంఘాలు విద్యార్థులు,యువకులు అందరూ ఈ యొక్క సేవ్ మణుగూరు కార్యక్రమాన్ని విజయవంతం చేసి రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలకు, సింగరేణి సంస్థకు తమ వైఖరిని బలంగా తెలియజేయాలని ఏఐటీయూసీగా పిలుపునిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా 22 23వ తేదీలలో నిరాహార దీక్షల కార్యక్రమాన్ని చేపడుతున్నామని సేవ్ మణుగూరు కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర అధ్యక్షుడు, కొత్తగూడెం శాసనసభ్యులు హాజరవుతున్నారని కావున అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆఫీస్ బేరర్ ఆవుల నాగరాజు, ఆదర్ల సురేందర్, ఫిట్ కార్యదర్శి జి శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీ ఉడుత శివకుమార్, లీగల్ అడ్వైజర్ దండు విజయ్ కుమార్, ఫిట్ కమిటీ మెంబర్లు దరిపెల్లి వెంకటేశ్వర్లు ఎస్కే వలి, సందీప్,కార్తీక్ లౌద్, నర్సయ్య, బైరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రస్తుత వాతావారణం పట్ల
## అప్రమత్తంగా ఉండాలి

**- కార్పొరేటర్ కంచర్ల హిమశ్రీ**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రస్తుతం కొనసాగుతున్న వాతావరణ పరిస్థితులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కార్పొరేటర్ కంచర్ల హిమశ్రీ అన్నారు. కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని 18వ డివిజన్ పంజాబ్ గడ్డలో శుక్రవారం ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కంచర్ల జమలయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా హిమశ్రీ మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణ పరిస్థితిలు అనుకూలంగా లేవని ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర ఉక్కపోతతో పాటు పొండి ఎండ తీవ్రంగా ఉంటుందని, రాత్రి వేళల్లో వేసవిని మించి వేడి గాలులు వీస్తున్నాయని చెప్పారు. ఇలాంటి వాతావరణం వల్ల పిల్లలు, వృద్ధులు తీవ్ర అనారోగ్యాల పాలయ్యే ప్రమాదం ఉందని, అప్రమత్తంగా ఉండాలన్నారు. రానున్న వర్షా కాలం సీజన్లో ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని తెలిపారు. వర్షపు నీరు నిల్వ ఉండటం ద్వారా దోమలు వృద్ధి చెంది విష జ్వరాల భారిన పడే ప్రమాదం ఉందన్నారు. డా. రాము పలువురు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. అనంతరం పబ్లిక్ హెల్త్ మేనేజర్ వి శ్రీనివాసరావు, వాతావరణ పరిస్థితులు తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలపై వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వార్డు ఆఫీసర్ మధుసూధన్ రెడ్డి, సూపర్వైజర్ పార్వతి, వార్డు అభివృద్ధి కమిటీ సభ్యులు దేవదాస్ షవకత్ అలీ, మండలి రాజేశ్వరరావు, చిచ్చుడి కోటేశ్వరరావు, పద్మ,శైలజ, భాగ్యరేఖ, ఏఎన్ఎంలు పి శ్రీ లక్ష్మి, కె పద్మ, ఆశావర్కర్ రాజమణి, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## సికిల్‌సెల్ అనీమియాపై
## అవగాహన



**ప్రజాపక్షం/పాల్వంచ :** ముందస్తుగా వ్యాధి లక్షణాలను తెలుసుకొని తగిన చికిత్స తీసుకొని దాని ప్రభావాన్ని తగ్గించవచ్చని, సికిల్ సెల్ అనీమియా వంటి వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని పాల్వంచ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పోలారపు పద్మ అన్నారు. కళాశాలలో ప్రపంచ సికిల్‌సెల్ అనీమియా దినోత్సవం సంధర్భంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సంధర్భంగా వ్యాధి లక్షణాలు, దాని వలన వచ్చే అనర్థాలు, నివారణ చర్యలను విద్యార్థులకు వివరించారు. వ్యాధి పట్ల సమాజంలో అవగాహన కల్పించేందుకు విద్యార్థులు కీలక పాత్ర వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జే. మాధవి, ఎస్.శ్రీదేవి, రాజ్ కుమార్, హారిక తదితరులు పాల్గొన్నారు.

## ఏజెన్సీలో ప్రశ్నార్ధకంగా ప్రభుత్వ పాఠశాలల మనుగడ..!

**-ఉపాధ్యాయులు ఉంటారు.. పిల్లలు ఉండరు..!**
**- అధికారుల పర్యవేక్షణకు ఆమడదూరంలో ప్రభుత్వ పాఠశాలలు**
**-విద్యార్థులు వస్తే టీచర్లు రారు.. టీచర్లు వస్తే విద్యార్థులు ఉండరు**



**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి :** అన్నపురెడ్డిపల్లి మండలంలో ఎక్కువ శాతం ఏజెన్సీ ప్రాంతం కావడం వలన ప్రతి మారుమూల గ్రామంలో గిరిజన బాలబాలికలకు విద్య అందించే లక్ష్యంతో ఐటీడీఏ ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాలలను ఏర్పాటు చేయడం జరిగింది. కొంత కాలం లక్ష్యాన్ని చేరుకున్నప్పటికీ ప్రస్తుతం ఉన్న పరిస్థితులలో ఉపాధ్యాయులు ఉన్నా కూడా విద్యార్థులు లేకపోవడం వలన పాఠశాలలు మూతపడే పరిస్థితికి దారి తీస్తోంది. మారుతున్న కాలంతో పాటు పాఠశాలలో మౌలిక సదుపాయాలు, విద్యా బోధనలో మార్పులు కల్పించకపోవడంతో ప్రభుత్వం విఫలమైందని, పిల్లలను బడికి చేరువ చేయడంలో ఉపాధ్యాయులు వెనుకబడి ఉన్నారని, విద్యార్థులు తల్లిదండ్రులను చైతన్యపరిచే దశలో ప్రభుత్వ యంత్రాంగం కఠినమైన నిర్ణయాలు తీసుకోకపోవడం, ఏజెన్సీ ప్రాంతాలైనప్పటికీ ఎక్కడపడితే అక్కడ ప్రైవేటు పాఠశాలలకు అనుమతులు ఇచ్చి ప్రోత్సహించడం వలన పిల్లలను ప్రైవేటు పాఠశాలలో చేర్పించడానికి తల్లిదండ్రుల మొగ్గు చూపుతున్నారని, ఇలా ఎన్నో కారణాలు ఉన్నప్పటికీ ప్రభుత్వ నిబంధనలు ప్రకారం ఏజెన్సీ ప్రాంతంలో నిర్వహిస్తున్నటువంటి ఐటీడీఏ పాఠశాలలో పది మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు చొప్పున ఏర్పాటు చేయవలసి ఉండగా కనీసం ప్రస్తుతం ఉన్న పాఠశాలలో 10 మంది విద్యార్థులకు కూడా లేకపోవడం గమనార్హం. కొన్ని పాఠశాలలో పిల్లలు లేకపోయినా ఇద్దరు టీచర్లు ఉండటం కొసమెరుపు. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నటువంటి ఉపాధ్యాయులు పిల్లలు లేకపోవడంతో ఒక రోజు వచ్చి ఒకరోజు రాకపోవడం జరుగుతుంది. ఈ పాఠశాలలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ పూర్తిగా నిద్రవస్థకు చేరుకుంది. ఉన్నత అధికారులు మారుమూల ప్రాంతాలలో ఉన్నటువంటి పాఠశాలలను పర్యవేక్షణ చేయడం పెను సవాలుగా మారుతున్న సమయంలో ఉపాధ్యాయులు ఆలసత్వానికి దారి తీస్తోంది. ఇది ఇలా కొనసాగుతూ పోతే రానున్న రోజుల్లో ఏజెన్సీ ప్రాంతాలలో ప్రాథమిక పాఠశాలలు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని అటు ఉపాధ్యాయులు ఇటు తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇప్పటికే అన్నపురెడ్డిపల్లి మండలంలో క్రింది కట్టుగూడెం ప్రాథమిక పాఠశాల, గుంపెన ప్రాథమిక పాఠశాల మూత బడి శిథిలావస్థకు చేరుకున్నాయి. ఇప్పటికైనా ఐటీడీఏ ఉన్నతాధికారులు ఇటువంటి పాఠశాలలపై పర్యవేక్షణ పెంచి మౌలిక సదుపాయాలను కల్పిస్తూ విద్యార్థుల సంఖ్య పెంచే విధంగా పాఠశాలలు మూతపడకుండా చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుకుంటున్నారు.

## నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయండి

**-భూసేకరణ, పరిహారం చెల్లింపుల పురోగతిపై అధికారులతో సమీక్ష**
**-కమిషనర్ కె శివకుమార్ నాయుడు**







**ప్రజాపక్షం/అశ్వాపురం:** జిల్లాలో కొనసాగుతున్న నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి, పెండింగ్ అంశాలను సత్వరమే పరిష్కరించాలని ఆర్అండ్ఆర్, ఇరిగేషన్ భూసేకరణ కమిషనర్ కె శివకుమార్ నాయుడు అధికారులను ఆదేశించారు. శుక్రవారం అశ్వాపురం మండలంలోని సీతమ్మసాగర్ ప్రాజెక్ట్, సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు తొలి పంప్‌హౌస్‌ను పరిశీలించిన అనంతరం బీజీ కొత్తూరులోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అంకిత్‌తో కలిసి భూసేకరణ పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు, సీతమ్మసాగర్ బహూళార్ధక ప్రాజెక్టు, పులుసుబొంత, సింగభూపాలెం ప్రాజెక్టులతో పాటు ఇతర సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, పరిహారం చెల్లింపులు, అటవీ అనుమతులు, సర్వే పనులు, కోర్టు కేసుల పురోగతిని ప్రాజెక్టుల వారీగా సమీక్షించారు. ప్రాజెక్టుల అమలులో ఎదురవుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించి, భూసేకరణ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. రైతులకు న్యాయమైన పరిహారం అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, అవార్డుల జారీ, పరిహారం చెల్లింపుల ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. సమీక్షలో జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ఫేజ్ 1లో 1,522 ఎకరాలకు అవార్డులు జారీ చేసినట్లు తెలిపారు. ఫేజ్ 2లో 2,365 ఎకరాలకు పరిహారం చెల్లించగా, ఫేజ్ 3లో 1,621 ఎకరాల్లో 1,350 ఎకరాలకు అవార్డులు జారీ చేసి, 903 ఎకరాలను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. మిగిలిన భూములకు సంబంధించి నిధులు అందిన వెంటనే పరిహారం చెల్లింపులు పూర్తి చేస్తామని చెప్పారు. అలాగే సీతమ్మసాగర్, పులుసుబొంత, సింగభూపాలెం ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ పురోగతిని కమిషన్‌కు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులు నిర్దేశిత గడువులోగా పూర్తయ్యేలా కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఈసమావేశంలో భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, సూపరింటెండింగ్ ఇంజనీర్ శ్రీనివాస్‌రెడ్డి, ల్యాండ్ సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, ఎస్‌డీఎలోసీలు రవీంద్రనాథ్, వెంకట్రావు, మండల తహసీల్దార్లు, భూసేకరణ విభాగ అధికారులు, పాల్గొన్నారు.

## డాగ్ స్క్వాడ్‌తో పోలీసుల విస్తృత తనిఖీలు



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు మండల పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం జూలూరుపాడు ఎస్సై జీనత్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ఆకస్మికంగా విస్తృత తనిఖీలు చేపట్టారు. కొత్తగూడెం నుండి వచ్చిన క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ బృందంతో కలిసి గ్రామంలోని పాన్ షాపులు, పాఠశాల పరిసరాలు, ఇతర అనుమానాస్పద ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. గంజాయి, మాదక ద్రవ్యాల వంటి నిషేధిత పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలను అరికట్టడమే లక్ష్యంగా డాగ్ స్క్వాడ్ సహాయంతో ఈ సోదాలు నిర్వహించారు. అనంతరం జూలూరుపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల నందు విద్యార్థులకు మాద్గద్రవ్యాల నివారణ. మరియు అవగాహన కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా ఎస్సై జీనత్ కుమార్ మాట్లాడుతూ సమాజానికి శాపంగా మారిన మాదక ద్రవ్యాల నిర్మూలనకు, శాంతిభద్రతల పరిరక్షణకు ఈ తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. ప్రజలు తమ పరిసరాల్లో ఎలాంటి అనుమానాస్పద కార్యకలాపాలు గమనించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. భవిష్యత్తులోనూ మండల వ్యాప్తంగా ఇలాంటి ఆకస్మిక తనిఖీలు కొనసాగుతాయని ఎస్సై జీనత్ కుమార్ హెచ్చరించారు. ఈ తనిఖీల్లో డాగ్ స్క్వాడ్ సిబ్బంది, క్లూస్ టీమ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి:** భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను అన్నపురెడ్డిపల్లి మండలంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పర్సా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈసందర్భంగా కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాహుల్ గాంధీ నిరంతరం పోరాడుతున్నారని పేర్కొన్నారు. అనంతరం పేదలకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేసి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో నాయకులు నరకాల లక్ష్మారెడ్డి, దుబ్బాకుల రాము, చింతం నరసింహారావు, గోడ పద్మ, పోతగంటి రాంబాబు, తప్తా వెంకటేశ్వర్లు, బదుగు ముత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

## సీఐ ఎల్లయ్యకు దోసపాటి ఘన సన్మానం



**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురం పోలీస్ స్టేషన్ నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన చిలివేరు ఎల్లయ్యను శుక్రవారం ప్రముఖ సామాజిక సేవకుడు, దోసపాటి రంగారావు చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు, శివ కామేశ్వరి గ్రూప్స్ డైరెక్టర్ దోసపాటి పిచ్చేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా నూతన సీఐ ఎల్లయ్యకు పూల బొకే అందజేసి, శాలువాతో సన్మానించి జ్ఞాపికను బహూకరించారు. అశ్వాపురం మండలంలో ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ శాంతిభద్రతల పరిరక్షణలో విజయవంతం కావాలని ఆకాంక్షించారు. నూతన బాధ్యతలు చేపట్టిన ఎల్లయ్యకు శుభాకాంక్షలు తెలియజేసిన దోసపాటి పిచ్చేశ్వరరావు, ప్రజలకు పోలీసు శాఖ మరింత చేరువ కావాలని కోరారు.

## సర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి




**ప్రజాపక్షం/అశ్వాపురం:** ఈనెల 25 నుంచి ప్రారంభమయ్యే ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్)ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని, ప్రతి ఇంటిని సందర్శించి అర్హులైన ఓటర్ల వివరాలను నమోదు చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, పినపాక నియోజకవర్గ ఎన్నికల అధికారి బి రాహుల్ బీఎల్‌వోలు, బీఎల్‌ఏ సూపర్వైజర్లకు సూచించారు. శుక్రవారం అశ్వాపురం రైతు వేదికలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జూన్ 25 నుంచి జూలై 24 వరకు జరిగే సర్వేలో ఎన్యుమరేషన్ ఫారాలను ఖచ్చితమైన వివరాలతో పూరించి సేకరించాలని, ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తప్పని సరిగా పాటించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఓటరు నమోదు ప్రక్రియను పాదర్శకంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. సూపర్వైజర్లు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టి ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఆర్ఐ అనూష, మాస్టర్ ట్రైనర్ హరమయ్య, బీఎల్‌వోలు, బీఎల్‌ఏ సూపర్వైజర్లు పాల్గొన్నారు.

## కేటీఆర్ విమర్శలు మాని అభివృద్ధికి సహకరించాలి



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** విమర్శలు చేయడం మాని రాష్ట్ర అభివృద్ధికి సహకరించాల్సింది పోయి జిల్లా మంత్రులపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నల్లమోతు రమణ అన్నారు. శుక్రవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించి, కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో నల్లమోతు రమణ మాట్లాడుతూ బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో కేసీఆర్ కుటుంబం రాష్ట్రాన్ని అప్పులు పాలు చేసిందని ఆరోపించారు. జిల్లా మంత్రులను విమర్శించే నైతిక అర్హత కేటీఆర్‌కు లేదని, అసత్య ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు అంకిరెడ్డి కృష్ణారెడ్డి, భోజ్య నాయక్, సర్పంచ్ ఇస్లావత రుక్మిణి, ఉప సర్పంచ్ రామకృష్ణ, ఉపతల ఏడుకొండలు, బొర్రా సురేష్, మహేష్, బోయిన కోటేశ్వరరావు, అన్వర్, శంకర్, మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

## మట్టి టిప్పర్ సీజ్..



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** జూలూరుపాడు మండల కేంద్రంలోని పాపకొల్లు క్రాస్ రోడ్డు నందు ఓవర్ లోడుతో వెళ్తున్న మట్టి టిప్పర్ ను శుక్రవారం కొత్తగూడెం రవాణా శాఖ మొబైల్ స్క్వాడ్ అధికారి అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ (ఏ.ఎం.వి.ఐ) అశోక్ పట్టుకొని సీజ్ చేశారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్ కి తరలించారు. ఈ సందర్భంగా ఏ. ఎం.వీ.ఐ అశోక్ మాట్లాడుతూ నలుగురు ఇన్స్పెక్టర్లతో కూడిన మొబైల్ స్క్వాడ్, భద్రాద్రి జిల్లాల్లో ప్రత్యేక తనిఖీలు చేపడుతున్నామని గత వారం రోజులుగా తనిఖీలు చే పట్టి ఆరు టిప్పర్ లారీలను సీజ్ చెయ్యటం జరిగిందని వాహనదారుల వద్ద ధ్రువపత్రాలు సరిగ్గా లేకపోయినా, పన్నులు చెల్లించకపోయినా, అధిక లోడుతో వెళ్లినా కేసులు నమోదు చేస్తూ అవసరమైతే వాహనాలను సీజ్ చేస్తున్నామని తెలిపారు.

# పనులను త్వరితగతిన పూర్తి చేయండి



**- అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్**

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** యంగ్ ఇండియా స్కూల్, జేఎన్టీయూ ఇంజనీరింగ్ కాలేజ్ నిర్మాణ పనులను త్వరితగతిన నాణ్యత ప్రమాణాలతో నిర్మాణం చేయాలని, అధికారులను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదేశించారు. శుక్రవారం ఖమ్మంరూరల్ మండలంలోని మద్దులపల్లిలో రూ.108కోట్లతో నిర్మితమవుతున్న జేఎన్టీయూ ఇంజనీరింగ్, పొన్నెకల్లులో నిర్మితమవుతున్న ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులను ఆకస్మికంగా పరిశీలించారు. నిర్మాణ ప్రాంతాలలో తిరుగుతూ పనుల నాణ్యత, భవనాల నమూనా మ్యాప్‌లను పర్యవేక్షించి అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. యంగ్ ఇండియా సమీకృత గురుకులాల వద్ద లింక్, అంతర్గత రోడ్లు, ప్రణాళిక ప్రకార 4జూనియర్, 9సీనియర్ హాస్టల్ బ్లాకులు, వెయిటింగ్‌హాల్, అకాడమిక్‌బ్లాక్ భవనాల నిర్మాణంకు కార్మికులకు అత్యధికంగా పెంచి, పనులను త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయాలని, అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ...ప్రభుత్వం విద్యా రంగం అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని ముందుకు సాగుతున్నదని తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన ఉన్నత విద్య, మెరుగైన ఉపాధి కోర్సులను అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ ముఖ్య లక్ష్యమని అన్నారు. జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణం పూర్తయితే స్థానిక యువతకు సాంకేతిక విద్య అందుబాటులోకి వచ్చి వారి భవిష్యత్తుకు బలమైన పునాది ఏర్పడుతుందని అన్నారు. అదే విధంగా యంగ్ ఇండియా స్కూల్ పూర్తి కావడంతో పరిసర ప్రాంతాల విద్యార్థులకు మంచి విద్య అవకాశాలు అందుతాయని తెలిపారు. పనులు నాణ్యతపై ఎటువంటి రాజీ ఉండకూడదని, ప్రతి దశలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్మాణాలు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పనుల్లో ఆలస్యం లేకుండా ముందస్తు ప్రణాళికలతో అవసరమైన వనరులు సమకూర్చుకుని, నిర్ణీత గడువులోపే పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ ఇంజనీరింగ్ అధికారి బుగ్గయ్య, తహశీల్దార్ వినయేందర్‌రెడ్డి, సంబంధితశాఖల అధికారులు పాల్గొన్నారు.

# గ్రీన్ భద్రాద్రి నూతన కార్యవర్గం ఎన్నిక

**- హాజరైన ఎంఎల్ఏ తెల్లం**

**ప్రజాపక్షం/భద్రాచలం :** గత దశాబ్దానికి పైగా పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తున్న గ్రీన్ భద్రాద్రి 14వ నూతన కార్యవర్గ ఎన్నిక శుక్రవారం జరిగింది. అధ్యక్షునిగా ఆర్ రామకృష్ణారెడ్డి, కార్యదర్శిగా భూక్య రంజిత్ నాయక్, కోశాధికారిగా ఉప్పాడ రామ్ ప్రసాద్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా డా. కృష్ణ ప్రసాద్, వీరయ్య, మహిళా విభాగం సహాయ కార్యదర్శిగా లక్ష్మీ సావిత్రి, పిఆర్ఓ సంపత్, లీగల్ అడ్వైజర్‌గా రామ రాజు తిరుమల రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదే విధంగా హార్టికల్చర్ అడ్వైజర్లుగా లయన్స్ డా.గోళ్ల భూపతిరావు, కామిశెట్టి కృష్ణ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యాతిథిగా హాజరైన ఎంఎల్ఏ డా.తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ భద్రాచలం పుణ్యక్షేత్రానికి చిరునామా అని, మరో చిరునామా పచ్చదనంతో ఉండాలన్నారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని, మొక్కలు నాటడం ద్వారా భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించవచ్చని పేర్కొన్నారు. అనంతరం పట్టణ సర్పంచ్ పూనెం కృష్ణ మాట్లాడుతూ పచ్చదనంతో ఆహ్లాదకరమైన వాతావరణం లభిస్తుందని, తద్వారా స్వచ్ఛమైన గాలి లభిస్తుందన్నారు. భవిష్యత్ తరాల వారికి మనిమిచ్చే గొప్ప వరం పచ్చదనమే అని చెప్పారు. ప్రముఖులు యోగి సూర్యనారాయణ, భగవాన్‌స్వీట్స్ శంకర్ మాట్లాడుతూ గ్రీన్ భద్రాద్రి సేవలను కొనియాడారు. నూతనంగా ఎంపికైన కార్యవర్గం భారీ ఎత్తున వృక్ష సంపదను పెంచాలని సూచించారు. అనంతరం నూతన సభ్యులను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ భద్రాద్రి సభ్యులతో పాటు పట్టణానికి చెందిన పలువురు పాల్గొన్నారు.



# వనజాకు శస్త్రచికిత్స జరగలేదు..

**కత్తెర ఎలావచ్చింది అనేదానిపై విచారణ చేస్తాం : డిఎంఅండ్‌హెచ్ఒ**



**ప్రజాపక్షం/గుండాల :** ఇటీవల గుండాల ఆసుపత్రి నుండి ఖమ్మం తరలించిన గర్భిణి,శిశువు మృతిపై పూర్తి స్థాయిలో విచారణ చేపడుతున్నామని వనజాకు అసలు శస్త్ర చికిత్స జరగలేదని డిఎంహెచ్ఒ తుకారం, డిసిహెచ్ఒ రవిబాబు అన్నారు. రాష్ట్ర ఆరోగ్యశాఖ కమిషనర్, జిల్లా కలెక్టర్ ఆదేశాలమేరకు శుక్రవారం గుండాల పిహెచ్‌సిని విజిట్‌చేసి డాక్టర్, సిబ్బందితో విచారణ చేశారు. కత్తెర ఎలావచ్చింది అనేదాని పై సూర్తిస్థాయిలో విచారణ జరిపి పై ఉన్నతాదికారులకు ప్రతులను సమర్పించి బాద్యులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇల్లందు ప్రభుత్వ ఆసుపత్రిలో కూడ విచారణ చేసినట్లు తెలిపారు . గుండాల వైద్యాది కారిలేకుండా ఎలాంటి వైద్యం అందించారని , డెలివరి చేసిన సమయంలో ఎవరు ఉన్నారని, ఆపరేషన్ చేశారా.. నార్మల్‌డెలివరినా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ముందుగా మృతురాలు స్వగ్రామమైన శంభునిగూడెం గ్రామాన్ని సందర్శించి కుటుంబాన్ని పరామర్శించారు.

**ఆసుపత్రిలో పూర్తి స్థాయిలో సిబ్బందిని నియమించాలి..**

గుండాల ఆసుపత్రిలో పూర్తి స్థాయిలో సిబ్బందిని నియమకాలను జరిపి ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించాలని కోరుతూ సిపిఐ పార్టీ, న్యూడెమొక్రసిపార్టీ, కాంగ్రెస్‌పార్టీ, బిఆర్ఎస్‌పార్టీ, నవచైతన్య యువజన సంఘం నాయకులు డిఎంఅండ్‌హెచ్ఒతుకారాంకు వినతి పత్రాలను అందించారు. అందుకు వారు సానుకూలంగా స్పందించారు.

## పట్టణ అభివృద్ధిలో మరో ముందడుగు

**ప్రజాపక్షం/మధిర మున్సిపాలిటీ:** పట్టణాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు మున్సిపల్ ఛైర్‌పర్సన్ సామినేని సుజాత పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం మున్సిపాలిటీకి నూతనంగా మంజూరైన జేసీబీని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు డీ.శిరీష, వై.కోటేశ్వర రావు, వై.చారులత, బీ.రేవతి, జి.మాధురి, ఎం.నాగలక్ష్మి, ఎస్.కే.రషీదున్, ఎస్.వెంకట్రావు, ఎస్.రాజేశ్వరి, వి.వెంకట నాగేశ్వర రావు, వి.వినయ్‌కుమార్, వై.వెంకట అప్పారావు, బి.విజయకుమారి, ఆర్.రూప, డీ.నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్యుత్ అందించడమే ప్రభుత్వ లక్ష్యం

**- ఎంఎల్ఏ డా.తెల్లం**



**ప్రజాపక్షం/భద్రాచలం :** ప్రజలకు, రైతులకు, పరిశ్రమలకు నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంఎల్ఏ డా.తెల్లం వెంకట్రావు అన్నారు. శుక్రవారం పట్టణ పరిధిలోని ఇండస్ట్రియల్ ఏరియాలో లో ఓల్టేజీ సమస్యను తీర్చేందుకు నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ విద్యుత్ నిత్య జీవితంలో భాగమని, ఒక్క నిమిషం కరెంటు పోయినా ప్రజలు తట్టుకోలేరని అన్నారు. లో ఓల్టేజీ సమస్యలకు చెక్కుపెట్టి నాణ్యమైన విద్యుత్‌ను ప్రజలకు సరఫరా చేసేందుకు ప్రభుత్వం పరంగా తమ వంతు కృషి సాగిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పూనెం కృష్ణ, డిఇ జీవన్ కుమార్, ఏడిఇ నర్సింహారావు, ఏఇ రాజారావు, వెంకట్రాజు, రామకృష్ణ, ఉదయ్, రత్నకుమార్, త్రినాథ్ రెడ్డి, కరీం, శంకర్, యుగంధర్ ఇదర సిబ్బంది పాల్గొన్నారు.

# 72.66 శాతం యూరియా పంపిణీ పూర్తి

**- జిల్లా వ్యవసాయాధికారి బాబూరావు**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** రైతులకు సకాలంలో ఎరువులు అందించాలనే సంకల్పంతో చేపట్టి యూరియా బుకింగ్ విధానం జిల్లాల్లో విజయవంతంగా అమలవుతోందని జిల్లా వ్యవసాయాధికారి బాబూరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు యూరియా బుక్ చేసుకున్న రైతులకు 72.66 శాతం పంపిణీ పూర్తైనట్లు చెప్పారు. రైతుల అవసరాలకు అనుగుణంగా యూరియా నిల్వలు అందుబాటులో ఉండటంతో పాటు బుకింగ్ చేసిన రైతులకు వేగవంతంగా సరఫరా చేస్తున్నాని చెప్పారు. శుక్రవారం నాటికి 10014 మంది రైతులు యూరియా బుక్ చేసుకోగా 39944 బస్తాల యూరియా బుక్ అయినట్లు చెప్పారు. ఇందులో ఇప్పటికే 28980 యూరియా బస్తాలు రైతులకు పంపిణీ చేశామన్నారు. జిల్లాలో 130410 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉందుబాటులో ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లో పిఎసిఎస్ రైతువేదికలు వ్యవసాయ శాఖ సిబ్బంది ఏఇఓలు ఏఓలు మండల వ్యవసాయాధికారులు సమన్వయంతో పనిచేస్తూ రైతులకు ఎరువులను పంపిణీ చేస్తున్నారని చెప్పారు. రైతులు అవసరానికి సరిపడా మాత్రమే యూరియా బుక్ చేసుకోవాలని అధికంగా కొనుగోలు చేయాల్సిన అవసరం లేదన్నారు. రైతులకు యూరియా బుకింగ్ సరఫరా, ఇతర వ్యవసాయ సేవలకు సంబంధించి సమీప వ్యవసాయ విస్తరణాధికారి , వ్యవసాయాధికారి, మండల వ్యవసాయాధికారిని సంప్రదించాలని బాబూరావు సూచించారు.

## సైబర్‌నేరస్తుడి అరెస్ట్



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** విద్యార్థులకు ట్రైనింగ్ ఇస్తానని నమ్మబలికి, నకిలీ ఎంఓయూలు చూపించి వారి నుంచి రూ.10 లక్షలు వసూలు చేసి మోసం చేసిన నిందితుడిని ఖమ్మం సైబర్ పోలీసులు శుక్రవారం హైదరాబాద్‌లో అరెస్ట్ చేసి ఖమ్మం సైబర్ క్రైం కోర్టులో హాజరుపరిచినట్లు సైబర్ క్రైం డిఎస్‌పి ఫణిందర్ తెలిపారు. డిఎస్‌పి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లాకు చెందిన ప్రముఖ విద్యాసంస్థకు సదరు నేరస్తుడు డి రవికిరణ్ తాను హైదరాబాద్‌లో ఐబిటి ప్రొఫెసర్ అని వాట్సప్‌లో పరిచయం చేసుకుని విద్యార్థులకు తమ సంస్థలో ట్రైనింగ్ ఇస్తానని నమ్మబలికాడు. అందుకు సంబంధించిన నకిలీ మెమోరాండమ్ ఆఫ్ అండర్‌స్టాండింగ్ (ఎంఓయూ) లెటర్‌ను ఇమెయిల్ ద్వారా పంపాడు. అతడి మాటలు నమ్మిన విద్యార్థులు అతనికి ఫీజు రూపంలో పదిలక్షల రూపాయలు వసూలు చేసి అనంతరం స్పందించక పోవడంతో అనుమానంతో బాధిత విద్యార్థులు సైబర్ పోలీసులను ఆశ్రయించారు. కేసు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులకు విద్యార్థులు పంపిన బ్యాంక్ ఖాతా ఆధారంగా హైదరాబాద్‌కు చెందిన రవికిరణ్‌గా గుర్తించి అక్కడికి వెళ్లి అతడిని అరెస్ట్ చేసినట్లు డిఎస్‌పి ఫణిందర్ తెలిపారు. నిందితుడిని ఖమ్మం సైబర్ కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. కేసును వేగవంతంగా ముగించినందుకు నేరస్తుడిని పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన డిఎస్‌పి తో పాటు సైబర్ సిఐ భూక్యా రవికుమార్, ఎస్సైలు రంజిత్‌కుమార్, విజయ్‌కుమార్, కానిస్టేబుల్ కృష్ణారావు, నాగేశ్వరరావు, స్టేషన్ సిబ్బంది పోలీసు కమిషనర్ సునీల్‌దత్ అభినందించారు.

## ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/కూసుమంచి:** కాంగ్రెస్ అగ్రనేత, లోక్ సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని కూసుమంచిలోని ఎంఎల్ఏ క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా వేడుకలను నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు కేక్ కట్ చేసి రాహుల్‌గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన దీర్ఘాయుష్షుతో, సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో క్యాంపు కార్యాలయ ఇంచార్జ్ భీమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు బజ్జూరి వెంకటరెడ్డి, జిల్లా నాయకుడు జొన్నలగడ్డ రవికుమార్, మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షులు మట్టే గురవయ్య, లోక్యతండ సర్పంచ్ పడిత్య వెంకటేష్ నాయక్, కాంగ్రెస్ నాయకులు కంచర్ల జీవన్ రెడ్డి, బొల్లంపల్లి సుధాకర్‌రెడ్డి, చాట్ల పరశురాం, రాంకుమార్, వీరారెడ్డి, మల్లేష్‌రావు, యువజన నాయకులు పీబీ శ్రీనివాస్, మహమ్మద్ రఫీ, శేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు



**ప్రజాపక్షం/ముదిగొండ :** మండలంలోని పెద్ద మండవ, గంధశిరి మున్నేరు ప్రాంతాల నుంచి ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలించినా, అలాగే ఇసుక అంశంపై గ్రామాల్లో అలజడి సృష్టించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటానని తహసీల్దార్ రవికుమార్ హెచ్చరించారు. ఇసుక అవసరమున్న ప్రజలు ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన మన ఇసుక వాహనం ద్వారా నేరుగా ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకోవాలని సూచించారు. ఈ విధానం ద్వారా పారదర్శకంగా, సులభంగా, సమర్థవంతంగా ఇసుక సరఫరా జరుగుతుందని తెలిపారు. ఇసుక విక్రయాల్లో పారదర్శకతను పెంచడంతో పాటు అక్రమ రవాణను అరికట్టడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రజలు అధికారిక పోర్టల్‌లో ప్రభుత్వ నిర్ణయించిన ధరను చెల్లించి, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ఇసుకను ఇంటివద్దకే పొందవచ్చని వివరించారు. ఆన్‌లైన్‌లో అవసరమైన పత్రాలతో దరఖాస్తు చేసుకున్న తర్వాత గ్రామ పంచాయతీ కార్యదర్శి జిపిఓ పరిశీలన అనంతరం అనుమతులు జారీ చేయబడతాయని తహసీల్దార్ రవికుమార్ తెలిపారు.

## మోడిఫై సైలెన్సర్ల ధ్వంసం

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** నిబంధనలకు విరుద్ధంగా ద్విచక్రవాహనాలకు భారీశబ్దాలు చేసే మోడిఫై సైలెన్సర్లతో తిరుగుతున్న వాహనదారుల నుంచి తనిఖీలలో స్వాధీనం చేసుకున్న 1650 సైలెన్సర్లను ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాసులు ఆదేశాల మేరకు శుక్రవారం సిఐ సత్యనారాయణ సమక్షంలో సిబ్బంది రోడ్డుపై పేర్చి రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ యువత అధిక మోతాదులో శబ్దం వచ్చే సైలెన్సర్లను తమ ద్విచక్రవాహనాలకు ధరించి భారీ శబ్దలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. అలాంటి వారిని పట్టుకుని కౌన్సిలింగ్ ఇస్తున్నామన్నారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు వాహనాలు ఇచ్చే ముందు రోడ్డుభద్రతలు తెలియజేయవలసిన బాధ్యత వారిపై ఉందన్నారు. నిభందనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

# ప్రభుత్వ ఉపాధ్యాయుడి రౌడీయిజం

**అర్థరాత్రి జేసీబీలతో పక్కరైతు భూమిలో గాడి కొట్టిన వైనం**





**ప్రజాపక్షం/కొణిజర్ల :** ప్రభుత్వ ఉపాధ్యాయుడు దౌర్జన్యంగా ఓ రైతు భూమిలోని రేకుల షెడ్డు, కోళ్లఫారం ను ధ్వంసంచేసి పట్టాపొలం మధ్యలో జేసీబీతో అర్థరాత్రి దౌర్జన్యంగా గాడి కొట్టిన సంఘటన మండల పరిదిలోని తనికెళ్లలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్ఐ గుగులోత్ సూరజ్ తెలిపిన వివరాలు ప్రకారం తనికెళ్ల గ్రామానికి చెందిన చలమల వెంకటేశ్వర్లు అనే రైతుకు తుమ్మలపల్లి గ్రామ రెవిన్యూ పరిదిలో సర్వేనెంబర్ 175 లో రెండు ఎకరముల వ్యవసాయభూమి ఉంది. సుమారు 50 సంవత్సరాలపైగా ఆభూమిలో వ్యవసాయం చేసుకుంటున్నారు. తనికెళ్ల గ్రామానికి చెందిన పెరిక బాలాజీ ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఆభూమిని ఆక్రమించుకునేందుకు గత 10 సంత్సరాల క్రితమే పథకం వేశాడు. ఆభూమి జోలికి రావడంతో చలమల వెంకటేశ్వర్లు అనే రైతు అప్పట్లో కొణిజర్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నుంచి బయటపడేందుకు గాను పెరిక బాలీజీ గ్రామపెద్దల సమక్షంలో ఆభూమి జోలికి రానని ఒప్పంద పత్రం రాయించి ఇచ్చాడు. కాని ఆభూమిని కాజేయాలఉద్ధేశ్యం బలంగా ఉండటంతో ఈనెల 12న రాత్రి సుమారు 10 గంటల సమయంలో బాలాజీ తన అనుచరులతో జేసీబీతో చలమల వెంకటేశ్వర్లు భూమిలో నిర్మించుకున్న రేకులషెడ్డు, కోళ్లఫారం, వెంకటేశ్వర్లు తండ్రి మరణంతో నిర్మించిన సమాధిని సైతం తవ్వి దగ్గరలోని కరంటు సబ్‌స్టేషన్ సమీంలో ముక్కుడు గుట్ట వద్ద ట్రాక్టర్లతో పారబోశాడు. అంతటితో ఆగకుండ పట్టాభూమి మధ్యలో లోతుగా గాడి కొట్టించాడు. షెడ్డుకు అమర్చిన కరంటు మీటర్‌ను సైతం పీకి బయటపడేశారు. దీంతో కేసు నమోదు చేసిన పోలీసులు నాన్‌బెయిల్‌బుల్ కేసు 329(3), 324(5), రెడ్‌విత్ 3(5), బిఎన్ఎస్ సెక్షన్‌లతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# యశోదలో ఎక్మో ద్వారా అత్యాధునిక చికిత్సలు

**-డాక్టర్ వై. సూర్యప్రకాష్**




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** శ్వాసకోశ, గుండె వైఫల్యంతో బాధపడుతున్న వారికి హైదరాబాద్‌లోని సోమాజీగూడ ఆసుపత్రిలో ఎక్మో విధానంలో అత్యాధునీక వైద్య చికిత్సలు అందిస్తున్నట్లు ప్రముఖ క్రిటికల్ కేర్ సీనియర్ వైద్యులు వై. సూర్యప్రకాష్ తెలిపారు. శుక్రవారం ఖమ్మంలోని యశోద మెడికల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వైద్యులు సూర్యప్రకాష్ మాట్లాడుతూ సాధారణ చికిత్సలు సరిపోని పరిస్థితులలో ప్రాణాలను కాపాడుకోవడంలో అధునాతన క్రిటికల్ కేర్ విధానంలో ఎక్మో (ఎక్స్‌ట్రా కార్పోరియల్ మెంబ్రేన్ ఆక్సిజనేషన్) విధానం ఒకటని తెలిపారు. శ్వాసకోశ , గుండె వైఫల్యంతో బాధపడుతున్న రోగులకు ఎక్మో లాంటి ఆధునాతన సాంకేతిక వైద్యంతో ప్రాణాలను కాపాడవచ్చునని తెలిపారు. కృత్రిమ గుండె, ఊపిరితిత్తుల్లాగా పని చేస్తూ ఎక్మో శరీరంలోని ముఖ్యమైన అవయవాల పనితీరుకు మద్దతునిస్తుందని తెలిపారు. తద్వారా రోగి శరీరం కోలుకోవడానికి తగిన సమయం లభిస్తుందన్నారు. పారాక్వాట్ విష ప్రభావం డ్రగ్ ఓవర్ డోస్ వంటి తీవ్రమైన విష ప్రభావాల కేసులను నిర్వహించడంలో, ప్రత్యేక డయాలసిస్, ఎక్మో థెరపి ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఒకప్పుడు ఇలాంటి పరిస్థితుల్లో ప్రాణాపాయం ఎక్కువగా ఉండేదని గత దశాబ్ద కాలంలో క్రిటికల్ కేర్ వైద్య రంగంలో సాధించిన అద్భుతమైన ప్రగతి ఈ అత్యాధునీక విధానాలని తెలిపారు. ప్రాణాంతక పరిస్థితుల నుంచి బయటపడేలా ఈ విధానాలు పని చేస్తాయని తెలిపారు. యశోద ఆసుపత్రిలో అధునాతన క్రిటికల్ కేర్ సదుపాయాలు, మల్టీ డిసిప్లీనరీ నిపుణులు, ఎవిడెన్స్, బెస్ట్ ట్రిట్‌మెంట్, ఐసియు అవేర్‌నెస్ వంటి కార్యక్రమాల ద్వారా, అధునీక ఇంటెన్సీవ్ కేర్ వంటి సదుపాయాలు ఉన్నాయన్నారు. ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్‌రావు,పరమేష్, నాగార్జున, బాలకృష్ణ పాల్గొన్నారు.

# వాడీవేడిగా మున్సిపల్ సమావేశం

**-తీర్మానాలపై గందరగోళం**
**-ఆందోళనకు దిగిన కౌన్సిలర్లు**






**ప్రజాపక్షం/వైరాః** వైరా మున్సిపాలిటీ సాధారణ సమావేశం శుక్రవారం హాట్ హాట్‌గా జరిగింది. ఈ సమావేశానికి ప్రారంభం ముందు కొంత సమయం గందరగోళంగా మారింది. మున్సిపాలిటీలో ఏం జరుగుతుందో ఎవరు ఏ విధంగా మాట్లాడుతున్నారు. అర్థం కాని పరిస్థితి. రోడ్లపై వెళ్లే వారు సైతం మున్సిపాలిటీలో గొడవ ఏమిటి అని ఆగి చూసిన సందర్భం. వైరా మున్సిపాలిటీ 5వ వార్డు కౌన్సిలర్ కట్టా స్వరూపరాణి సమస్యలను వివ రించే నేపధ్యంలో స్వల్ప గందర గోళం ఏర్పడింది. దీంతో పలు వురు కౌన్సిలర్లు తొలుత 95 తీర్మానాలు పెట్టడం గురించి అభ్యంతరాలు తెలిపారు. తర్వాత జరిగిన సమావేశంలో కొన్ని తీర్మానాలను తిరస్కరించి ఆమోదం తెలిపారు. హాట్‌హాట్‌గా ప్రారంభమైన మున్సిపల్ సమావేశం చివరకు తీర్మానాలు ఆమోదంతో ముగిసింది. ఈ సమావేశంలో దిద్దుపూడి 15 వార్డులో డంపింగ్ యార్డ్ రోడ్డును, చుట్టుప్రక్కల ఫెన్సింగ్ విధానాన్ని తిరస్కరించారు. ఆర్చి నిర్మాణం తిరస్కరించారు. గతంలో ముఖ్యమంత్రి పర్యటన అప్పుడు జరిగిన ఖర్చులు రూ.3లక్షలు పెట్టిన తీర్మానాన్ని తిరస్కరించారు. ఏది ఏమైనప్పటికీ మున్సిపాలిటీలో జరిగిన గందరగోళం పట్ల వైరాలో జోరుగా చర్చ జరుగుతూ ఉంది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ రామచంద్రరావు, సుధీర్, శ్రీమాన్య, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

# విత్తన ఎరువులు దుకాణాల్లో తనిఖీలు



**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరులోని నకిలీ విత్తనాలను అరికట్టేందుకు పోలీస్ మరియు వ్యవసాయ శాఖ వారి ఆధ్వర్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కల్లూరు లోని శుక్రవారం ఫెర్టిలైజర్స్ అండ్ సీడ్స్ షాపులను సందర్శించి నిర్వహణ, రికార్డులు, నిల్వ వివరాలు, లైసెన్సులు, బిల్లుల నిర్వహణ లావాదేవీలు వివరాలు, రైతులకు విక్రయిస్తున్న విత్తనాలు, ఎరువులు, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా లేదా అనే విషయంపై పూర్తిస్థాయిలో తనిఖీలు నిర్వహించారు. అదేవిధంగా ప్యాకెట్లు పై ఉన్న వివరాలను తేదీలు, గడువులు తేదీలు, కంపెనీ గుర్తింపు తదితర అంశాలను పరిశీలించారు. కొనుగోలు చేసే రైతులు తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని సూచించారు. బిల్లులు లేకుండా కొనుగోలు చేసిన వస్తువుల విషయంలో భవిష్యత్తులో సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, అలాగే అనుమానస్పదంగా అమ్మే కనిపించే విత్తనాలు లేదా ఎరువుల గురించి తెలిస్తే వెంటనే తమ సమాచారం అందించాలని ఎస్సై, హరిత వ్యవసాయ శాఖ అధికారిని రూప లు రైతులను కోరారు.

# అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేయండి

**-ఎంపికి వినతి**



**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం సమీపంలోని నాగార్జున సాగర్ ఎడమ కాలువకు ప్రజల సౌకర్యార్థం అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని ఖమ్మం ఎంపి రామసహాయం రఘురాంరెడ్డికి శుక్రవారం వినతి పత్రం సమర్పించారు. బైపాస్ రోడ్డు రాపర్తి నగర్ నుంచి రామన్నపేట, దానవాయిగూడెం, రాపర్తి నగర్ బిసి కాలనీ, టిఎన్‌జీవోస్ కాలనీ మీదుగా వెళ్లే రోడ్డు డంపింగ్ యార్డు వద్ద కలుస్తుందని వారు వినతి పత్రంలో తెలిపారు. సాగర్ కాలువపై అండర్ బ్రిడ్జి నిర్మాణం జరిగితే రామన్నపేట, పడమటితండా, కామంచికల్, దానవాయిగూడెం, డోర్నకల్, దారెడు, మహబూబాబాద్ వెళ్లేందుకు ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుందని వారు వినతి పత్రంలో తెలియజేశారు. వినతి పత్రాన్ని పరిశీలించిన ఎంపి దీనికి తగు పరిశీలన నిమిత్తం అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. వినతి పత్రం సమర్పించిన వారిలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు బోడా వీరన్న, మాజీ కార్పొరేటర్ బొప్పి సతీష్, బొప్పి ప్రభాకర్, కామంచికల్ మాజీ సర్పంచ్ సత్యనారాయణ, మేదరమెట్ల శ్రీను, నూకరాజు వెంకటేశ్వర్లు, కొనకండ్ల వాసు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

# గణేశ్వరం పాఠశాలలో వన మహోత్సవం



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** మండల పరిధిలోని గణేశ్వరం పాఠశాలలో వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఎస్‌కె రఫీక్ పాషా ఆధ్వర్యంలో నిర్వహించిన వన మహోత్సవంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పాఠశాలలో నాటిన మొక్కలు చెట్లుగా మారి నీడను ఇస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎల్. గోపాలరావు, ఎన్. వెంకటేశ్వరరావు, ఎ. విజయలక్ష్మి , స్థానికులు ఉపేందర్, లింగయ్య, బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

# 23న కలెక్టరేట్ వద్ద ధర్నాను జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/కొణిజర్ల :** ఈనెల 23న కలెక్టరేట్ వద్ద వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మంజిల్లా సహాయ కార్యదర్శి పిట్టల రాంబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల పరిధిలోని పెద్దమునగాల, కొండవనమాల, రెడ్డిగూడెం, కాచారం, పెద్దగోపతి గ్రా మాల్లో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పిట్టల రాంబాబు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలన్నారు. వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. 23న జరిగే ధర్నాలో వ్యవసాయ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తడికమళ్ల నడిపి వెంకయ్య, చింతల మల్లయ్య, సుధాకర్, బాబు పాల్గొన్నారు.

# మంత్రి క్యాంపు కార్యాలయంలో జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఏఐసిసి అగ్రనేత, పార్లమెంట్ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం వీడియోస్ కాలనీలోని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్యాంపు కార్యాలయంలో ఖమ్మం అర్బన్ డిసిసి అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. దేశంలో బిజెపి అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న ఏకైక నాయకులు రాహుల్ గాంధీ అని తెలిపారు. దేశానికి కాబోయే ప్రధాని రాహుల్ గాంధీ అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, సుడా ఛైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఏఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, మాజీ మేయర్ పునుకొల్లు నీరజ, మాజీ కార్పొరేటర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సారూ.. ఇదేమీ చట్టం..!

**జర్నలిస్టులకు నో ఎంట్రీ**



**ప్రజాపక్షం/వైరాః** వైరా మున్సిపాలిటీ సాధారణ సమావేశం శుక్రవారం వైరా మున్సిపాలిటీ కార్యాలయం నందు మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి వైరాలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు అనుమతి లేదు అని కమీషనర్ రామచంద్రరావు చెప్పి బయటకు వెళ్లాలని ఆదేశించారు. ఇక్కడ వరకు బాగానే ఉంది. మున్సిపాలిటీ సాధారణ సమావేశం జరిగేటప్పుడు మున్సిపల్ ప్రజాప్రతినిధులు, అధికారులు ఉండాలని చెప్పిన అధికారులు బయట వ్యక్తులను సమావేశంలో ఉంచడానికి ప్రత్యేకంగా ఏమైనా చట్టం ఉందా కలెక్టర్ అనుమతి ఉందా జరా ఆలోచించు సారు.